శ్వేతపత్రాలతో నాటకం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించిన పథకాలు అమలును తప్పించుకునేందుకు శ్వేత పత్రాలు విడుదల అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి నాటకాలకు తెర తీశారు. ఎన్నికల హామీల అమలు చెయ్యకుండా గత ప్రభుత్వంపై బురద జల్లడానికి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు ఉంది ఆయన తీరు.

- సంకు సత్యకుమార్, మాజీ ఎంపీటీసీ, బువ్వనపల్లి

సాగుకు పెట్టుబడి సాయం ఇవ్వాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగు ప్రారంభించే సమయానికి మాకు రైతు భరోసా ఇచ్చారు. ఏటా సాగు సమయానికి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అన్నదాత సుఖీభవలో సాగుదారులకు రూ. 20వేలు ఇవ్వాలి.

- నాగబాబు, రాయన్నపాలెం

తల్లికి వందనం అందించాలి



నా పిల్లలు ఇద్దరూ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. నా భర్త కరోనాతో మూడేళ్ల క్రితం మరణించారు. ఒక పిల్లవాడికి అమ్మ ఒడి పథకం వచ్చేది. చంద్రబాబు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు అమ్మకు వందనం పథకం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. త్వరగా అమ్మకు వందనం సహాయం అందించాలి.

- చేబోలు మెంటాదేవి, గణపవరం

రైతులకు రూ.20 వేలు ఎప్పటి నుంచి




చంద్రబాబు సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల ప్రచారంలో ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు సహాయం అందిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైంది. ఈ పరిస్థితిలో రైతులకు పెట్టుబడికి డబ్బు చాలా అవసరం. ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే రైతులకు అందించాలి.

- ఎస్ శేషగిరిరావు, రైతు, గణపవరం

నెలకు రూ.1,500 ఎప్పుడు?



తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అందిస్తామని కూటమి తరపున చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇంకా మహిళలకు ఇస్తానన్న సాయంపై ఇంత వరకూ స్పష్టత రాకపోవడం శోచనీయం. ఈ పథకం ఎప్పుడు ఇచ్చేదీ వెంటనే ప్రకటించి, అధికారం చేపట్టిన నెల నుంచి మహిళలకు లబ్ధి చేకూర్చాలి. - ఎ.సత్యవతి, గణపవరం



సూపర్ సిక్స్.. బాబు హ్యాండ్సప్

నిడమర్రు/దెందులూరు: అవకాశవాద రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన చంద్రబాబు అధికారం కోసం ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి నేడు నిధులు లేవంటూ పథకాల అమలుపై చేతులెత్తేసి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం. ఇంటిలోని ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం ఇస్తాం. ఏడాదికి ఉచితంగా 3 వంట గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి రూ. 3వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సాయం ఇలా పలు హామీలను మేనిఫెస్టోలో చేర్చి ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాల్సిందేనని ఉంగుటూరు నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

మేనిఫెస్టో అమలులో కూటమి ప్రభుత్వం క్లీన్‌బౌల్డ్

తల్లికి వందనం ఈ ఏడాది ఉన్నట్టా.. లేనట్టా!

ఉచిత బస్సుపై నోరుమెదపని కూటమి నేతలు

మూడు వంట గ్యాస్ సిలెండర్ల ఊసేలేదు



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం	అర్హులైన మహిళలు	నెలకు ఇవ్వాల్సిన సాయం
ఉంగుటూరు	24,000	రూ.3.6 కోట్లు
దెందులూరు	45,000	రూ.6.75 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

వైఎస్సార్ రైతు భరోసా పథకం

నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
ఉంగుటూరు	రూ.37.2 కోట్లు
దెందులూరు	రూ.38.4 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (కోట్లలో)
ఉంగుటూరు	రూ.42.3 కోట్లు
దెందులూరు	రూ.43.2 కోట్లు

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందాల్సిన సాయం

తల్లికి వందనం పథకం వివరాలు

నియోజకవర్గం	అర్హులు	లబ్ధి
ఉంగుటూరు	32,000	రూ.48 కోట్లు
దెందులూరు	35,000	రూ.52.5 కోట్లు





యువతకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	అర్హులైన యవత	నెలకు ఇవ్వాల్సిన సాయం
ఉంగుటూరు	21,000	రూ.6.3 కోట్లు
దెందులూరు	40,000	రూ.12 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన సాయం

జగనన్న అమ్మ ఒడి పథకంలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన ప్రోత్సాహం

నియోజకవర్గం	లబ్ధి
ఉంగుటూరు	రూ.29 కోట్లు
దెందులూరు	రూ.32 కోట్లు

మహిళలకు రూ.1,500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతినెల రూ.1,500 ఇస్తామని చెప్పారు. ఎన్నికల వేళ ప్రతి సభ, సమావేశాల్లో కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టాక ఆ ఊసే లేదు. కోట్లాది మహిళలు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

- నిట్టా లీలానవకాంతం, జోగన్నపాలెం

తల్లికి వందనంపై ప్రకటన ఏదీ?



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఒక్కొక్కరికీ ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. ఈ పథకంపై ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎటువంటి ప్రకటన ఏదీ రాలేదు.

- గొరిపర్తి వరలక్ష్మి, కొవ్వలి

క్లుప్తంగా

నిడమర్రు సీఐ సుభాష్‌ను అభినందించిన డీజీపీ



నిడమర్రు సీఐ ఎం.సుభాష్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న డీజీపీ తిరుమల రావు

నిడమర్రు: మైనర బాలిక కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచినందుకు బుధవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిడమర్రు సీఐ ఎం.సుభాష్‌ను ఏపీ డీజీపీ సీహెచ్ తిరుమలరావు అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందించారు. పల్లెరమూడిలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని అతి తక్కువ కాలంలో అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచిన బృందంలో సభ్యుడిగా ఉన్న నిడమర్రు సీఐ ఎం.సుభాష్‌కు ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా నిడమర్రు, గణపవరం, చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పోలీస్ సిబ్బంది సీఐ సుభాష్‌కు అభినందనలు తెలిపారు.

జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవం



నారాయణపురం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసును సత్కరిస్తున్న ఆర్జేడీ ప్రభాకరరావు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవంలో భాగంగా కళాశాల అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. బుధవారం కళాశాలలో వైభవంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాసరావుతో పాటు అధ్యాపకులను సత్కరించి, మెమెంటోలను అందజేశారు. ఈకార్యక్రమానికి ఏలూరు ఆర్జేడీ ప్రభాకరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నారాయణపురం హైస్కూలు హెచ్ఎం మీరాసాహెబ్ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ.7.39 లక్షల విరాళం

ఉంగుటూరు: వరద బాధితుల సహాయార్థం బుధవారం దాతలు రూ.7.39 లక్షలు అందజేశారు. ఉంగుటూరు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ధర్మరాజుకు విరాళాలను దాతలు అందజేశారు. దాతలందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవపై ర్యాలీలు



గోపన్నపాలెంలో అవగాహనార్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్



జల్లికాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ, వైద్యసిబ్బంది

దెందులూరు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. దెందులూరు, పోతునూరు, పెరుగ్గూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, కొవ్వలి, గాలాయగూడెం, శ్రీరామవరం, సీతంపేటలో గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఫ్లెక్సీలతో నినాదాలు చేసుకుంటూ ర్యాలీలు నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రోడ్ల వెంబడి, వీధుల్లో బ్లీచింగ్ చల్లి, డ్రెయిన్లు శుభ్రం చేశారు.

స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ

పెదపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాలను మెరుగుపర్చేందుకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడులో బుధవారం జరిగిన స్వచ్ఛతా హీసేవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

గణపవరం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గణపవరం మండలం జల్లికాకినాడలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ బాతు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రూ.3 లక్షల నగదు అపహరణ

భీమడోలు: భీమడోలు రిలయన్స్ మార్ట్ సమీపంలో బుధవారం ఓ బ్యాగ్‌లోని రూ.3లక్షల నగదు మాయమైంది. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన కిరాణా వ్యాపారి తుమ్మలపల్లి మహేశ్వరరావు తనకు చెందిన రూ.3 లక్షల చెక్కును తీసుకుని భీమడోలు గణపతి సెంటర్‌లోని ఎస్‌బీఐలో చెక్ మార్చుకుని రూ.3లక్షల నగదును తీసుకున్నాడు. ఆ సొమ్మును ఓ బ్యాగ్‌లో భద్రంగా పెట్టుకుని అక్కడ నుంచి తన బైక్‌పై భీమడోలు రిలయన్స్ మార్ట్ వద్దకు వచ్చి అక్కడ వాహనాన్ని నిలిపాడు. మార్ట్‌కు ఎదురుగా ఉన్న హోల్‌సేల్ కిరాణా దుకాణంలోకి వెళ్లాడు. ఆ సొమ్మును ఆ బైక్‌పై ఉంచి లోనికి వెళ్లాడు. దుకాణంలోంచి బయటకు వచ్చి చూడగా బ్యాగ్ మాయమైంది. రూ.3లక్షల నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనితో బాధితుడు మహేశ్వరరావు పోలీసులను ఆశ్రయించాడు. భీమడోలు ఎస్సై వై. సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రిలయన్స్ మార్ట్ వద్ద గల సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

సాంఘిక బహిష్కరణపై తహసీల్దార్ విచారణ

భీమడోలు: కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో దళిత పెద్దలే దళితులమైన తమను సాంఘిక బహిష్కరణ చేసారంటూ బుధవారం ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వీని కలిసి బాధితులు ఫిర్యాదు చేశారు. కొందరు కావాలనే తమకు కొల్లేరులోని భూమి వాటాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, నైతికంగా తమను గ్రామం నుంచి వెలివేశారంటూ గ్రామంలోని బాధిత 57 దళిత కుటుంబాలకు చెందిన వారంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని కలెక్టర్ తహసీల్దార్ బి.రమాదేవిని ఆదేశించారు. ఆగడాలలంకలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి ఇరువర్గాలతో తహసీల్దార్ బి.రమాదేవి, ఎస్సై వై.సుధాకర్ బహిరంగ సమావేశాన్ని నిర్వహించి ఇరువర్గాల పెద్దలతో చర్చించి సమస్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల వృద్ధికి కృషి చేయాలి

భీమడోలు: విద్యా ప్రమాణాల మెరుగుదలకు శిక్షణ తరగతులు దోహదపడతాయని భీమడోలు ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఆర్‌పీలుగా పాశం పాండురంగావు, జి.బాలభాస్కర్, ఉపేంద్ర వ్యవహరించారు. పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు సబ్జెక్టుపై స్కూలు కాంప్లెక్స్ సమావేశం కాంప్లెక్స్ కార్యదర్శి గంగాధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ గ్రంథాలయ నిర్వహణ అంశంపై టీచర్లుకు అవగాహన కల్పించారు. హెచ్ఎం బి.శ్రీనివాసరావు, టీచర్లు మండే సుధాకర్, రెడ్డియ్య, కృష్ణారావు, కె.తులసి, సీఆర్‌పీ ఎస్‌వీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

పెదవేగిలో పోలీస్ స్టేషన్ భవనం నిర్మించాలి

దెందులూరు: పోలీసులకు, పోలీస్‌స్టేషన్లకు అభివృద్ధి, సంక్షేమానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతాక్రమంలో చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు అన్నారు. బుధవారం డీజీపీ ఏలూరు పర్యటన సందర్భంగా ఏలూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ డీజీపీని కలిసి పెదవేగి సర్కిల్ కార్యాలయం ఏర్పాటు, పెదవేగి పోలీస్‌స్టేషన్ శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. పరిష్కారానికి కృషి చేస్తామని డీజీపీ అన్నారు.

క్రీడల్లో వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులు

పెదపాడు: వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. 67వ డిస్ట్రిక్ట్ లెవెల్ అండర్ 17 ఇయర్స్ విభాగంలో జూడోలో ఇద్దరు విద్యార్థులు, అండర్ 14 ఇయర్స్ విభాగంలో జూడోలో ఇద్దరు విద్యార్థులు 70వ డిస్ట్రిక్ట్ లెవెల్ అండర్ 19 విభాగంలో పుట్‌బాల్‌లో ఒకరు హాకీలో ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, పీడీ తేళ్ల సునీలకుమారి, పీఈటీ జి గీతా వెంకట భవాని తదితరులు విద్యార్థులను అభినందించారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

పెదపాడు: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవతా ధర్మంతో ఆదుకోవాల్సిన అవసరముందని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఏపీ నాగేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని గోగుంట గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన వరద బాధితులకు సీఐటీయూ జిల్లా కమిటీ తరపున నిత్యావసర వస్తువులను బుధవారం అందించారు. ఏలూరు జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్, సీఐటీయూ జిల్లా నాయకులు కొర్రి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలికలకు అండగా ఉంటాం

దెందులూరు: ఏలూరు ఆశ్రంలో బీసీ హాస్టల్ వార్డెన్ వల్ల ఇబ్బందులకు గురైన బాధిత బాలికలకు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం వసతి, విద్య, రక్షణ సౌకర్యాలు కల్పించాలని జెడ్పీ స్థాయి సోషల్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం డిమాండ్ చేశారు. బుధవారం జోగన్నపాలెంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు ఆశ్రం హాస్టల్ వార్డెన్ కీచకపర్వంపై సీరియస్‌గా స్పందించాలన్నారు. బాధిత బాలికలకు, వారి కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు.

ఎస్సైను కలిసిన నాయకులు

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాగరాజుతోపాటు నారాయణపురం ఎంపీటీసీ భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు హరివిల్లి ధానయ్య, సీపాని బాలు, నేదురు గంగాధర్ రావు, పూడి వరప్రసాదు, తెర్లంగి బుర్రయ్య తదితరులు ఎస్సై సూర్యభగవాన్ ను కలిశారు.

సురక్షిత నీటిని అందించాలి

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అంటువ్యాధుల వ్యాప్తి కారణంగా ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించాలని వైద్య సిబ్బంది బుధవారం సూచించారు. ఈమేరకు గ్రామాల్లో మంచినీటి పరీక్షలు చేసి నీటి నాణ్యతను పరిశీలిస్తున్నారు. సర్పంచ్ చుక్కా అప్పారావు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు వైద్యసిబ్బంది పాల్గొన్నారు. గణపవరం, పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్యసిబ్బంది మంచినీటి పరీక్షలు, దోమల నిర్మూలన చర్యలు నిర్వహిస్తున్నారు.

నిషేధిత భూములను గుర్తించండి

ఉంగుటూరు: నిషేధిత భూములు వివరాలు గ్రామాల వారీ జాబితా తయారు చేయాలని వీఆర్వోలకు, సర్వేయర్లను తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు ఆదేశించారు. మండల సర్వేయర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్గదర్శకాలను బొడ్డేపల్లి తెలియజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిషేధిత భూముల లావాదేవీల వివరాలను ప్రభుత్వానికి పక్కా సమాచారం అందివ్వాలని అన్నారు. ఈనెల 19న స్పెషల్ కలెక్టరు భాస్కర్, ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయానికి వస్తారని తహసీల్దార్ బొడ్డేపల్లి తెలిపారు.

అశోక్‌కు జెడ్పీటీసీ సభ్యుల నివాళులు

దెందులూరు: చింతలపూడి నియోకవర్గ మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ ఆకస్మిక మరణం వైఎస్సార్‌సీపీకి, మెట్ట ప్రాంతాలకు, పేద, బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. బుధవారం కేఎస్ రామవరంలో అశోక్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామవరపుకోట, ద్వారకాతిరుమల జెడ్పీటీసీలు కడిమే రమేష్, చిగురుపాటి సామ్యూల్ ఉన్నారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

దెందులూరు: జూనియర్ డాక్టర్ల భవిష్యత్తును అడ్డుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకునే వరకు సమ్మె కొనసాగాస్తామని జూనియర్ డాక్టర్లు అన్నారు. జూనియర్ డాక్టర్ల రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు బుధవారం పోతునూరు, దెందులూరు, గోపన్నపాలెం వైద్యశాలల్లో సమ్మెలో పాల్గొన్నారు. అత్యవసర వైద్యసేవలు యథావిధిగా అందిస్తున్నట్టు తెలిపారు.

20న నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: దెందులూరు సెక్షన్ పరిధిలోని 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేయడానికి ఈ నెల 20న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దెందులూరు, కొత్తగూడెం, సత్యనారాయణపురం, కొమిరేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ జేపీజీ నటరాజన్ తెలిపారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొడదాం

భీమడోలు: ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం భీమడోలు, కురెళ్లగూడెంలో చిన్నారులతో వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కురెళ్లగూడెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో అవగాహన కల్పించారు. ఎంఈవో ఈ.శ్రీనివాసరావు, హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.